మినీకథ

# పేరసైటులు

వారణాసి రామబ్రహ్మం




నేను హైదరాబాద్‌లో ఉంటున్నాను. మా నగర్‌లో మోడైన ఒక చెట్టు. దాని క్రింద చినిగిన బట్టలతో అదుక్కొని అనాథ జీవితం గడుపుతున్న ఒక ముసలమ్మ నివసిస్తూ ఉంటుంది. ఒక పూట తినడం ఒక పూట పస్తు. ఇలా గడుపుతూ బతుకుతూ ఉంటుంది.

ఒకరోజు నేను అటువైపుగా వెళుతుంటే ఒకాయన ముసలమ్మతో ఊగిపోతూ మాట్లాడడం కనిపించింది. అతని సంభాషణం రాగయుక్తంగా, ఒక కవితలా ఇలా వినిపించింది.

''నా వేదన, నా శోధన, నా మేధ, నా వ్యధ
నా కవిత్వం, అంతా నీకే అంకితం
నువ్వు ఎలా అణగద్రొక్క బడుతున్నావో ఈ
(అ)సభ్య సామాజానికి చెప్పి, దాన్ని నిద్ర
లేపడమే నా జీవిత లక్ష్యం.''

ముసలమ్మకి ఎంత అర్థం అయిందో తెలియదు. ఆ 'కవిగారు' మాత్రం తన కవిత్వాన్ని ఒక ఎర్ర కాగితంమీద రాసి, ముసలమ్మ చిప్పలో వేసి ఆవేశంగా వెళ్ళిపోయాడు. ఆనవాయితీగా ముసలమ్మకి పదిపైసలు వేసి ముందుకు సాగాను.

మరికొన్ని రోజులకి ఒక సూటు-బూటు ఆయన ముసలమ్మ జీవితం గురించి కనుక్కుంటున్నాడు. ఆ వివరాలన్నీ పక్కన ఒక 'అసిస్టెంటు' రాసుకుంటున్నాడు. కొంత సేపటికి సూటు బూటు ఆయన హంసలాంటి కారెక్కి వెళ్ళిపోయాడు. నేను మౌనంగా ముసలమ్మకి పదిపైసల బిళ్ళ వేసి కదిలాను.

మరొక రోజు ఒక ఖద్దరు శాల్తీ ఆ ముసలమ్మని కారులో తీసుకు వెళ్ళాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఆరోజు పోలింగ్ అని. ఓటు వేసి వచ్చాక ముసలమ్మ యథాప్రకారం తన వృత్తి కొనసాగిస్తోంది.

కొన్ని నెలలకి రవీంద్ర భారతిలో ఒక కవికి, ఒక ప్రముఖ సినీ దర్శకునికి, ఒక మంత్రిగారికి సన్మానం అని నా స్నేహితుడు కాంప్లిమెంటరీ పాస్ మీద నన్ను లాక్కుపోయాడు. వేదిక మీద సన్మానితులని చూశాను. ఎక్కడో చూసి నట్టనిపించింది. అవును, వాళ్ళు ముగ్గురూ ముసలమ్మ దగ్గిర కనిపించిన 'కవిగారు', సూటు బూటు ఆయన, ఖద్దరు మనిషి. వాళ్ళ గురించి అందరూ ఘనంగా ఉపన్యసించారు. సన్మానం ముగిసింది.

ముసలమ్మని రోజూ నా పదిపైసలతో మౌనంగా పలకరిస్తూనే ఉన్నాను. ఆమె అక్కడే పడి ఉంటున్నది చేతన రహితమైన ఉలిలా,. రాళ్ళలాంటి కొందరి జీవితాలను రమ్య శిల్పాలుగా మారుస్తూ. అటువంటి స్థితిని ఆధారంగా చేసికొని బతుకుతున్న ఎందరో పేరసైటులను చూస్తూ. ●